సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 6 । మే । 2024



చేరికల జోష్

ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీలో చేరికల జోష్ కనిపిస్తోంది. టీడీపీ నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారు. - 8లో



మహిళ ఆత్మహత్య

ఇచ్ఛాపురంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుంటారు. - 8లో



ఓటరు స్లిప్పు లేదా..

ఓటరు స్లిప్పు ఇంకా అందలేదా. టెన్షన్ అక్కర్లేదు. దానికీ ఓ పరిష్కారం ఉంది. - 8లో

న్యూస్‌రీల్

7, 8 తేదీల్లోనూ పోస్టల్ ఓటు వేసే అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కచ్చితంగా వినియోగించుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కొందరు ఎన్నికల సిబ్బంది 4, 5, 6 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేకపోతే 7, 8వ తేదీల్లో ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో ఓటు వేయవచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించామని పేర్కొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ అసహనం



ఆర్ఓ రామ్మోహనరావుకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్‌ను సక్రమంగా వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు లేకపోవడంతో ఆర్ఓ రామ్మోహనరావుపై ఒక దశలో సీరియస్ అయ్యారు. ఆయనే స్వయంగా ఏర్పాట్లను చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. సుమారు గంటన్నరకు పైగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉండి పోయారు. పోస్టల్ బ్యాలెట్ వేయాలంటే ప్రాసెస్ పెద్దది. దీనంతటినీ ఒకే చోట పెట్టడం, పోలింగ్ సిబ్బంది తక్కువగా ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి వచ్చిన సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అనంతరం ఆర్ఓ రామ్మోహనరావుకు పలు సూచనలు చేశారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం పాత బస్టాండ్ : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ముగ్గురు ఉన్నతాధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నరసన్నపేటలో శనివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులకు తావిచ్చిన కారణంగా వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు, 24 గంటల్లో నోటీసులపై స్పందించి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నరసన్నపేట రిటర్నింగ్ అధికారి, మెప్మా పీడీ, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలియేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సారవకోట తహసీల్దార్ షోకాజ్ నోటీసులు అందుకున్నారు.

కరోనా, ఉక్రెయిన్ యుద్ధం, మణిపూర్ అల్లర్లు, విదేశీ జలాల్లోకి ప్రవేశం, సింధు పుష్కరాలు.. ఒకటా రెండా.. ఆపద వచ్చిన ప్రతిసారీ సీఎం వైఎస్ జగన్ ఆపద్బాంధవుని పాత్ర పోషించారు. జిల్లా వాసులు ఇతర ప్రాంతాల్లో ఇరుక్కున్న ప్రతి సందర్భంలోనూ మానవత్వం చూపించారు. డబ్బుల్లేక కొందరు, పరిచయాలు లేక ఇంకొందరు, బయటకు వెళ్లే దారి తెలీక మరికొందరు.. వేరే ప్రాంతాల్లో ఇరుక్కుపోయి ఉంటే సంప్రదింపులతో వారిని స్వస్థలాలకు చేర్చి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన మంచి మనసును చాటుకుంది.

ఆపన్నుల ఆత్మబంధువు



- ఇతర ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించిన వైఎస్ జగన్ సర్కారు
- బాధితులను క్షేమంగా జిల్లాకు తీసుకువచ్చిన ప్రభుత్వం
- ప్రతి సందర్భంలో మానవత్వం చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా పాలన సాగించిన వైఎస్ జగన్ సర్కారు.. ఆపద వేళ ప్రతిస్పందించిన తీరుకు దేశం మొత్తం సలామ్ కొట్టింది. కరోనా కాలం నుంచి టర్కీ భూకంపం విపత్తు వరకు, పాక్ జలాల్లోకి మత్స్యకారుల ప్రవేశం నుంచి ఉక్రెయిన్ యుద్ధం వరకు ఆపద వచ్చిన ప్రతిసారీ ప్రభుత్వం సిక్కోలు బిడ్డలను రక్షించుకుంది. కరోనా సమయంలో ఇతర ప్రాంతాల్లో ఉండిపోయిన వారిని జిల్లాకు తీసుకొచ్చారు. రాష్ట్రం కాని రాష్ట్రంలో, దేశం కాని దేశంలో ఉద్యోగాల కోసం వెళ్లి ఇబ్బంది పడుతుంటే...వారితో వెంటనే టచ్‌లోకి వెళ్లి, వారి సమస్యలు తీర్చి, సొంతూళ్లకు తీసుకొచ్చారు. చదువుల కోసం, ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ నెలకొన్న అనూహ్య పరిస్థితుల నేపథ్యంలో ఇబ్బంది పడుతుంటే నేనున్నానంటూ అభయమిచ్చి, వారికి భరోసా కల్పించి, ప్రభుత్వ నిధులతో వారిని కన్న ఊరికి తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే అని చెప్పవచ్చు.



మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో మన జిల్లాకు చెందిన వారు అక్కడ చాలా మంది చిక్కుకున్నారు. తుపాకులు, బాంబుల మోతలతో నిద్రలేని రాత్రులు గడపడమే కాకుండా తిండి, నీరు లేని పరిస్థితుల్లో భయాందోళనకు గురయ్యారు. ముఖ్యంగా సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, నిట్‌లో చదివిన పిల్లలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకు జీవుడా అంటూ గడిపారు. పరిస్థితిని గమనించిన వైఎస్ జగన్ ప్రభుత్వం సకాలంలో స్పందించి, వారి వద్దకు వెళ్లి, వారికి పైసా ఖర్చు కాకుండా విమానాల ద్వారా వారందరినీ జిల్లాకు తీసుకొచ్చింది.



2018 నవంబర్ 27న పాకిస్తాన్ భద్రతా దళాలకు వీరావల్‌లో సముద్రవేటలో మన జిల్లాకు చెందిన మత్స్యకారులు పట్టుబడ్డారు. దాదాపు 20మంది పాకిస్తాన్ కరాచీ జైలులో గడిపారు. వారి విడుదల కోసం అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం పెద్దగా ప్రయత్నించలేదు. అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ ప్రభుత్వం పలుమార్లు కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. ఎంపీలు విజయసాయిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్ విదేశాంగ మంత్రితో మాట్లాడి, 2020 జనవరి 6న వారందరినీ విడుదల చేయించి, సొంత ఊళ్లకు తీసుకొచ్చారు.



కరోనా వైరస్ వ్యాప్తి కట్టడి కోసం కేంద్రం లాక్‌డౌన్ అమలు చేసినప్పుడు జిల్లాకు చెందిన మత్స్యకారులు గుజరాత్, చెన్నై, తదితర ప్రాంతాల్లో చిక్కుకున్నప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.3కోట్లు ఖర్చు పెట్టి జిల్లాకు చెందిన 3064మంది మత్స్యకారులను 46బస్సుల ద్వారా వారి సొంత ఊర్లకు తీసుకొచ్చింది.



ట్రావెల్ ఏజెన్సీ నిర్వాకంతో సింధు నది పుష్కరాలకు జిల్లాలోని సోంపేట, నరసన్నపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి వెళ్లి యాత్రీకులు ఇబ్బందులు పడగా.. సీఎంఓ అధికారులు సకాలంలో స్పందించి.. ఇబ్బందులు పడిన వారి ఇక్కట్లను తీర్చారు. సరిపడా డబ్బులు ఇవ్వలేదని ట్రావెల్ ఏజెన్సీ ఒక గదిలో పెట్టి నిర్బంధించగా, బాధితులు సెల్ఫీ వీడియో ద్వారా ఆర్తనాదాలు పెట్టగా, వైఎస్ జగన్ ప్రభుత్వమే వెంటనే స్పందించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖతో మాట్లాడి నిర్బంధంలో ఉన్న వారందరినీ విడిచి పెట్టేలా చేసింది.



వజ్రపుకొత్తూరు, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి తదితర ప్రాంతాల నుంచి మలేషియా, గల్ఫ్ దేశాలకు ఉపాధి పనుల కోసం వలస వెళ్లి ఏజెంట్ల చేత మోసపోయి, దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. బాధితుల సంగతి తెలుసుకుని మంత్రి సీదిరి అప్పల రాజు సకాలంలో స్పందించారు. సీఎంతో మాట్లా డి, కేంద్రంతో సంప్రదింపులు జరిపి, వారందరి నీ క్షేమంగా ఊళ్లకొచ్చేలా చర్యలు తీసుకున్నారు.

రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్‌లో వైద్య, ఇతర కోర్సులు, ఉద్యోగాల కోసం వెళ్లిన జిల్లాకు చెందిన 20మంది ఇబ్బందులు పడుతుంటే...వెంటనే సీఎం జగన్ ప్రభుత్వం స్పందించి, కేంద్ర విదేశాంగ మంత్రితో మాట్లాడి, వారందరినీ సొంతిళ్లకు క్షేమంగా వచ్చేలా చర్యలు తీసుకుంది.



టర్కీ భూకంప సమయంలో కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. పలాస, కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన వారంతా అక్కడ చిక్కుకుని ఇబ్బంది పడుతుంటే, వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబీకులకు తెలియజేసి, బాధితులకు ఏం అవసరమో తెలుసుకుని, వారి అవసరాలను తీర్చారు.



స్పీకర్ తమ్మినేని సీతారాం తన అనుభవాన్నంతా రంగరించి ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని పూజారిపేటలో అందరినీ పలకరించారు. -ఆమదాలవలస

ప్రచార హోరు

ప్రచార పర్వం కొత్త పుంతలు తొక్కుతోంది. అభ్యర్థులు ఒక్క ఊరిని కూడా వదలకుండా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ర్యాలీలు, సభలు, ఆత్మీయ సంభాషణలతో ప్రచారాలను రక్తి కట్టిస్తున్నారు.

మంత్రి ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళంలో మూల మూలనా తిరుగుతున్నారు. సింగుపురం ప్రాంతంలో ఇలా ప్రచారం చేశారు. -శ్రీకాకుళం రూరల్



ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గురండి గ్రామంలో ఇలా ఉత్సాహంగా ప్రచారం చేశారు. -కొత్తూరు



ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ప్రచారంలో జోరు కనబరుస్తున్నారు. కవిటి మండలంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ఇలా ర్యాలీలు చేశారు. - కవిటి



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రచార రథంతో ఊళ్లన్నీ చుట్టేస్తున్నారు. అలుదులో పార్టీ గుర్తు చూపిస్తూ ప్రచారం చేశారు. -సారవకోట



టెక్కలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. లఖిదాసుపురంలో పార్టీ శ్రేణులతో కలిసి కలియదిరిగారు. - నందిగాం



మంత్రి అప్పలరాజు ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. మున్సిపాలిటీలో ఓ అవ్వను కలిసి ఆత్మీయంగా మాట్లాడారు. - కాశీబుగ్గ



ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సామాన్యులతో కలిసిపోతున్నారు. ఎస్.భీమవరం గ్రామంలో సరదాగా ఆటో నడిపారు. - జి.సిగడాం



కొలువుల జాతర



వైఎస్సార్‌సీపీ హయాంలో

- సచివాలయాల ఏర్పాటుతో 6852 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగుల నియామకం
- విద్యాశాఖలో 2018 డీఎస్సీతో 620 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగులు
- కలగా మిగిలిపోయిన 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ బాధిత టీచర్ల జీవితాల్లో వెలుగులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో 6,852 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు. 2018 డీఎస్సీలో ఎంపికైన 620 మందికి పోస్టులు, ఎప్పుడో 1998లో క్వాలిఫై అయిన 352 మందికి కొలువుల కేటాయింపు, కేజీబీవీల్లో 152, వైద్యారోగ్య శాఖలో 1961 పోస్టుల భర్తీ. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో వచ్చిన ఉద్యోగాలివి. గ్రామ స్వరాజ్య స్వప్నాన్ని సాకారం చేస్తూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వీటిల్లో ఉద్యోగాలను పెద్ద ఎత్తున సృష్టించారు. వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించారు. సచివాలయాలతో పాటు వివిధ శాఖల్లో ఉద్యోగాలను పెద్ద ఎత్తున భర్తీ చేశారు. ఇందులో మెజారిటీ శాశ్వత కొలువులు కాగా మరికొన్ని మినిమమ్ టైం స్కేల్, ఇంకొన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలున్నాయి.

వైద్య ఆరోగ్యశాఖలో ఇలా..

వైద్య ఆరోగ్యశాఖలో ఫుల్‌టైం డాక్టర్లు, స్పెషలిస్టులను నియమించింది. వీరితోపాటు వివిధ స్థాయిల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులను భర్తీ చేసింది. రిమ్స్‌తో పాటు విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో శాశ్వత, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో 1961 ఉద్యోగాలను కల్పించారు.

విద్యాశాఖలో ఇలా..

ముఖ్యంగా విద్యాశాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పించారు. 2019 ఎన్నికల స్ట్రాటజీగా 2018 డీఎస్సీని ప్రకటించి ఉద్యోగాలను భర్తీచేయలేదు. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సీఎం జగన్ 2018 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగులు కల్పించి, ఉద్యోగ నియామకాలను చేశారు. కేజీబీవీల్లో గెస్ట్‌ఫ్యాకల్టీగా పనిచేస్తున్న టీచర్లను కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా అవకాశం కల్పించారు. మరో 42 మంది పార్ట్‌టైం ఫ్యాకల్టీని కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా మార్చుతూ వారి జీతాలను రూ.26,759కు పెంచారు. అలాగే ఎన్నో పదోన్నతులు, మరెన్నో రిక్వెస్ట్ బదిలీలను కల్పించి వారి కుటుంబాల్లో ఆనందాలను నింపారు. ఆన్‌లైన్ బదిలీలను చేపట్టి అత్యంత పారదర్శకంగా తతంగాన్ని పూర్తిచేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లకు భారీగా జీతాలు..

ఇంటర్మీడియెట్ విద్య, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు పీఆర్సీ ప్రకారం భారీగా జీతాలను పెంపుదల చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇంటర్మీడియెట్ విద్యలో కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ.37 వేల నుంచి రూ.57,100కు జీతాలను పెంచారు. అలాగే డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లకు 40వేల నుంచి రూ. 60,100కు పెంపుదల చేసి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రభుత్వ ఉద్యోగులగా నియామకం చేసే ప్రక్రియ దాదాపుగా తుది దశకు చేరుకుందనేది తెలిసిన విషయమే.

చిరకాల స్వప్నం సాకారం..

సీఎం వైఎస్ జగన్ నిర్ణయంతో 1998 డీఎస్సీ అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు చిగురించాయి. దాదాపు 25 ఏళ్ల వారి నిరీక్షణ ఫలించింది. ఎన్నో ప్రభుత్వాలను కోరి అడిగి అలసిపోయిన తర్వాత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఒకే ఒక నిర్ణయంతో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ 352 అభ్యర్థుల జీవితాల్లో వెలుగులు కనిపించాయి. ఇప్పటి వరకు ఆరుగురు ముఖ్యమంత్రులు మారినా మారని వీరి తలరాతను ఎట్టకేలకు సీఎం జగన్ మార్చారు. మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్) రూపంలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)లగా ఉద్యోగాలు కల్పించారు. వీరితోపాటు 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు 112 మంది జీవితాల్లోను వెలుగులు నింపారు. 1998, 2008 డీఎస్సీ అభ్యర్థుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, పక్కాగా పూర్తిచేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమక్షంలోనే ఓపెన్‌గా భారీ స్క్రీన్‌పై ఖాళీలను ప్రదర్శించి.. ఎంచుకునే అవకాశం కల్పించారు. ఈ పోస్టింగ్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారి సొంతమండలాల పరిధిలోనే ఉద్యోగాలు కల్పించి సంతోషాలను నింపారు.



విద్యాశాఖలో భారీ స్క్రీన్‌పై ఖాళీలను ప్రదర్శిస్తూ.. కౌన్సిలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా నియామకాలు పూర్తి చేస్తున్న దృశ్యం (ఫైల్)

సీఎం పర్యటనకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ


- ఇచ్ఛాపురంలో రేపు సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ
- వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

కవిటి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 7న ఇచ్ఛాపురం రానున్నారని, ఈ ఎన్నికల ప్రచార సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం బల్లిపుట్టుగలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019లో నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర ముగింపు సైతం ఇచ్ఛాపురంలో నిర్వహించి అఖండమైన మెజారిటీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరిందని గుర్తు చేశారు. ఇచ్ఛాపురంపై వైఎస్ జగన్‌కు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇచ్ఛాపురం మున్సిపల్ ఆఫీస్ జంక్షన్‌లో నిర్వహించబోయే బహిరంగ సభలో ఆయన ఎన్నికల ప్రసంగం చేయనున్నట్లు పేర్కొన్నారు. సీఎం సభకు జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు చింతాడ రవి, నర్తు నరేంద్రయాదవ్, మండలపార్టీ కన్వీనర్లు కె.ప్రకాష్, వజ్జ మృత్యుంజయరావు, ఇండుగు ప్రకాశరావు, పట్నాయక్, శిలగాన భాస్కర్‌రావు, పి.రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీలు నిమ్మన దాస్, బోర పుష్ప, జెడ్పీటీసీలు తడక యశోద, ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉలాల భారతీదివ్య, స్వర్ణమణి లాభాల, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబూరావు, పి.నేతాజీ, కర్రి గోపయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ల జల్లు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ముఖ్యమంత్రి రాక	బహిరంగ సభ	సమయం
మే 7	ఇచ్ఛాపురం మున్సిపల్ ఆఫీస్ జంక్షన్	మధ్యాహ్నం 1.30

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఇచ్ఛాపురం: పట్టణంలో ఈ నెల 7న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. హెలీకాప్టర్ దిగేందుకు శ్రీసురంగి రాజా మైదానం, ఏఎస్‌పేట లే అవుట్, పండా కాలనీలో గల స్థలాలను పరిశీలించారు. బహిరంగ సమావేశం ఏర్పాటు చేసేందుకు సురంగి రాజామైదానం, దాసన్నపేట కూడలి, బంగ్లారోడ్ కూడలి, బస్టాండ్ కూడళ్లను పరిశీలించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

సజావుగా పోస్టల్ బ్యాలెట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జిల్లాలో ఆదివారం సజావుగా జరిగింది. రెండో రోజు ఎన్నికల విధుల్లో ఉన్న ఓపీఓలు, సెక్టార్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, అకౌంట్, వీవీటీ, వీఎస్‌టీ, బీఎల్ఓ, ఆర్ఓ, ఏఆర్ఓ, కంట్రోల్ రూంలో పనిచేసిన వారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఇచ్ఛాపురంలో 956, పలాసలో 934, టెక్కలిలో 1528, పాతపట్నంలో 1311, శ్రీకాకుళంలో 2059, ఆమదాలవలసలో 1397, ఎచ్చెర్లలో 851, నరసన్నపేటలో 1452 ఓట్లు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా రెండోరోజు 10,488 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడ్డాయి. మొత్తం రెండు రోజులు కలిపి 17,492 ఓట్లు పడ్డాయి.

క్లుప్తంగా

టీడీపీలో చేరిన నేతను నిలదీసిన గ్రామస్తులు



బావాజీనాయుడును నిలదీస్తున్న యువకులు, మహిళలు

నరసన్నపేట: మండలంలోని నర్సింగిబిల్లిలో వైఎస్సార్ సీపీ నుంచి మరో పార్టీకి వెళ్లిన పంగ బావాజీనాయుడుకు ఆదివారం చేదు అనుభవం ఎదురైంది. మారిన పార్టీ తరఫున స్థానిక టీడీపీ నాయకుడు పాగోటి అప్పలనాయుడుతో కలసి కరగాం పంచాయతీలోని పెద్ద కరగాం ప్రచారం నిమిత్తం బావాజీనాయుడు రాగా గ్రామ మహిళలు, యువకులు నిలదీశారు. వైఎస్సార్ సీపీని ఎందుకు వీడావు.. మాకు ఎందుకు సంప్రదించలేదు.. అంతా నీ ఇష్టమేనా.. నువ్వు ఏ పార్టీలో ఉంటే మేం ఆ పార్టీలో ఉండాలా.. మా అభిప్రాయాలకు ప్రాధాన్యత లేదా.. అని నిలదీశారు. ఏ ముఖం పెట్టుకొని మరో పార్టీ తరఫున ఓట్లు అడగడానికి వచ్చావని ప్రశ్నించారు. తమకు వైఎస్సార్ సీపీ పాలనలోనే మేలు జరిగిందని, తామంతా ఈ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. పంగబావాజీ నాయుడుకు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో గౌరవమైన పదవి లభించింది. ఆయన భార్య పంగ కృష్ణవేణికి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి కల్పించారు. అయినా పార్టీని వీడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ,ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పలాస జీఆర్‌పీ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో దిగువ లైన్ రైలుపట్టాలపై సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. నీలం షర్టు, నలుపు లుంగీ ధరించి ఉన్నాడు. గుర్తు తెలియని ఢీకొట్టడంతో మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పలాస రైలు నిలయంలో ఉన్న జీఆర్‌పీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య



సంతోష్‌కుమార్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : నరాల బలహీనత వ్యాధితో మానసికంగా బాధపడుతూ మతిస్థిమితం తగ్గి నగరంలోని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న టేకి కుమారి భర్త ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఉంటోంది. కుమార్తెకు వివాహమవ్వడంతో పెద్దకుమారుడు శంకర్, కోడలు, చిన్న కుమారుడు సంతోష్‌కుమార్‌లతో ఏపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్నారు. సంతోష్‌కుమార్(28) వార్డు నెంబరు 30లో వలంటీర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే రాజీనామా చేశాడు. మూడేళ్లుగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాకపోవడంతో ఆదివారం సాయంత్రం తన బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంతోష్‌కుమార్ తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు ఆత్మహత్య



శ్రీదేవి సష్మాల్(ఫైల్)

ఇచ్ఛాపురం: పట్టణంలో పెద్దాకుల వీధిలో లీలా బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్న శ్రీదేవి సష్మాల్ (43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఇంట్లో తలెత్తిన చిన్న గొడవ కారణంగా శ్రీదేవి మనస్థాపానికి గురైంది. బెడ్‌రూమ్‌లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు భర్త ప్రమోద్ సష్మాల్, కుమారులు జోగేష్, ప్రిన్స్ ఉన్నారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీలో.. చేరికల జోష్..

- అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై టీడీపీని వీడుతున్న కార్యకర్తలు
- గొర్లె కిరణ్‌కుమార్ విజయం కోసం విస్తృత ప్రచారం



ఆదివారం జి.సిగడాం మండలం సేతుభీమవరంలో బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరికల సందడి నెలకొంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు స్థానిక ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మరోసారి గెలుపు ఖాయంగా కనిపిస్తుండటంతో టీడీపీ నుంచి వలసలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఎచ్చెర్ల నియోజకవర్గంలో బీసీ నినాదం జోరుగా సాగుతోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మరోసారి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బీజేపీ తరఫున నడుకుదిటి ఈశ్వరరావు బరిలోకి దిగారు. ఈయన కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు. దీంతో నియోజకవర్గంలో 80 శాతం పైగా ఉన్న బీసీలు వైఎస్సార్ పార్టీ అభ్యర్థివైపే అనుకూలంగా ఉన్నారు. 1983 నుంచి ఇప్పటి వరకు పోటీ చేస్తున్న టీడీపీ గుర్తు ఈ ఎన్నికల్లో కనిపించకపోవటం సైతం ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ బలపడుతోంది.

ఇటీవల చేరికలు..

- రణస్థలం ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి గౌరి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి రమేష్, టీడీపీ సీనియర్ నాయకులు రామారావు వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరిణాంఅక్కివలస సిద్ధం యాత్రలో భాగంగా వీరికి కండువా వేసి ఆహ్వానించారు.
- రణస్థలం మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు గొర్లె విజయ్‌కుమార్ కూడా సీఎం సమక్షంలో వైఎస్సార్ సీపీ చేరారు.
- రణస్థలం మండలం పాతర్లపల్లిలో టీడీపీ నుంచి 24 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. గొర్లె శంకరరావు, చిత్రి ఈశ్వరరావులతో కూడిన నాయకుల బృందానికి ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు.
- లావేరు మండలం తామాడ పంచాయతీలో మునకాల రాంబాబు ఆధ్వర్యంలో 50 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.
- రణస్థలం మండలం అల్లివలసలో జనసేన పార్టీ నుంచి దుమ్ము సత్తిపిల్ల, గురువులతో కూడిన 20 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు.
- రణస్థలం మండలం మరువాడ పంచాయతీలో సూర్యనారాయణ, అప్పన్నలతో సహా 10 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు.
- రణస్థలం మండలం అర్జునవలస పంచాయతీ గిరినివానిపాలెంలో గుడ్లాల తవుడు, అల్లి గౌరునాయుడులతో పాటు 60 టీడీపీ, జనసేన కుటుంబాలు పార్టీలో చేరాయి.
- లావేరు మండలం అప్పాపురంలో పతివాడ గోవింద, మంగిశెట్టి సంతోష్‌లతో పాటు 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి.
- ఎచ్చెర్ల మండలం తోటపాలెం పంచాయతీ అభింఖాన్‌పేటలో 60 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. బస్వ గురయ్యరెడ్డి, టి.మాధవరావు లాంటి సీనియర్ నాయకులకు ఎమ్మెల్యే కిరణ్ కండువాలు వేసి ఆహ్వానించారు.
- ఎచ్చెర్ల మండలం పూడివలస, తమ్మినాయుడుపేటలో కంచి అప్పన్న, నక్కన శ్రీనులతో పాటు పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు.

అభివృద్ధి పథంలో ఎచ్చెర్ల..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో గత ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. 100 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరాయి. నియోజకవర్గంలో రూ.365 కోట్లతో నిర్మిస్తున్న బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌తో పాటు రూ.882 కోట్ల మేర వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. సంక్షేమ పథకాల రూపంలో రూ.1578 కోట్లు ప్రజల ఖాతాలకు జమయ్యాయి.



వైఎస్సార్‌సీపీలో చేరిన తామాడ పంచాయతీవాసులకు కండువాలు వేస్తున్న గొర్లె విజయ్‌కుమార్(ఫైల్)



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన అల్లివలస నాయకులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



అభింఖాన్‌పేట నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఏఐబీఈఏ కార్యదర్శి రాంబాబు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజలందరిపైనా ఉందని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీయూబీఈఏ) శ్రీకాకుళం రీజియన్ రీజనల్ కాన్ఫరెన్స్ రీజనల్ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులుగా 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తయినందున కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం ఎన్నికల తర్వాత బ్యాంక్‌ల ప్రయివేటీకరణకు తెరతీస్తే బ్యాంకింగ్ రంగంలోని తొమ్మిది సంఘాలు కలిసి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థకు కట్టుబడి ఉండాలని, ఈ మేరకు ఒక ప్రకటన చేయాలని కోరారు. యూనియన్ బ్యాంక్ శ్రీకాకుళం రీజియన్ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ మాట్లాడుతూ శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 56 బ్రాంచిలు ఉన్నాయని, సుమారు రూ.7,632 కోట్లు వ్యాపారం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏపీయూబీఈఏ అధ్యక్షుడు కాలె శ్రీనివాసరావు, ఏపీయూబీఈఏ ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్‌కుమార్, ఏఐయూబీఈఏ ప్రధాన కార్యదర్శి ఎస్.శంకర్, యూనియన్ ప్రతినిధులు పి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, జి.కరుణ, లక్ష్మీపతి, పి.సుమన్, కె.మోహనరావు, అనిల్, సూర్యకిరణ్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, శ్యాం, వసంతరావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై దుష్ప్రచారం

- వైఎస్‌ఆర్ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమల్లోకి వస్తుందని టీడీపీ దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్‌ఆర్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ చట్టం అమలు చేయలేదని, కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్ ద్వారా సూచించిందని, ఆ విషయాన్ని టీడీపీ విస్మరించి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజాక్షేత్రంలో గెలిచే సత్తాలేక అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేకమైన ఏ చట్టాన్నయినా వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమల్లోకి తీసుకురారని, ఇది సామాన్య ప్రజలకు కూడా తెలుసుని పేర్కొన్నారు. రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వారు సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కోసం సర్క్యులర్ జారీ చేస్తే దాన్ని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు ఆపాదిస్తూ టీడీపీ సోషల్ మీడియాలో, బహిరంగ సభలు, ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి ప్రచారాలను వైఎస్‌ఆర్ సీపీ లీగల్ సెల్ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. వాస్తవానికి టీడీపీ కూటమిలో ఈ చట్టం దొంగలు ఉన్నారని, అది వారు గుర్తించాలన్నారు. నీతి ఆయోగ్ ద్వారా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఉండాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని, ఆ విషయాన్ని టీడీపీ నాయకులు ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని మొట్టమొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం 1989లో ప్రతిపాదన చేయగా, ఆ తర్వాత వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నీతిఆయోగ్ ద్వారా దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో యాక్ట్ ను అమలు చేయమని ప్రతిపాదించిందన్నారు. అయితే న్యాయవాద సంఘాలనుంచి అభ్యంతరాలు రావడంతో నిలిపివేసినట్లు చెప్పారు.

ఓటర్ స్లిప్పు లేదా.. టెన్షన్ వద్దు

హిరమండలం: ఎన్నికలు సమీపిస్తున్న వేల బీఎల్ఓలు ఓటరు స్లిప్పులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. అయితే ఓటరు స్లిప్పులు లేకున్నా ఓటేసే అవకాశం ఉంది. ఎన్నికల రోజు బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. వారి వద్దకు వెళ్లి ఓటరు స్లిప్పులు పొందవచ్చు. లేకపోతే ఓటరు జాబితాలో క్రమ సంఖ్య తెలుసుకుని పోలింగు ఏజెంట్లకు చెప్పి వారికి తానే సంబంధిత ఓటరని నిరూపించుకునే గుర్తింపు కార్డును చూపి ఓటేయచ్చు. లేదంటే పోలింగు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే జాబితాలను పరిశీలించి పేరు ,క్రమ సంఖ్యను కాగితంపై రాసుకుని వెళ్ల వచ్చు. ఆ సమయంలో ఓటరు తగిన గుర్తింపు కార్డును తప్పకుండా వెంట తీసుకువెళ్లి పోలింగు కేంద్రంలో ఉండే అధికారులను చూపించి ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

మేమంతా జగనన్న బాటలోనే..



కాశీబుగ్గ: పార్టీలో చేరిన కంట్రగడ యువకులతో మంత్రి సీదిరి అప్పలరాజు



పాతపట్నం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కవిటి: లండారిపుట్టుగలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న పిరియా విజయ, నర్తు రామారావు

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

పాతపట్నం: కొత్తూరు మండల కేంద్రంలోని ఎస్సీవీధికి చెందిన సుమారు 200 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టొంపల కనకయ్య, కుప్ప శంకరరావు, దుర్గాసి గణపతి, కంద్ర రమణ, వినోద్‌కుమార్, వడమ జవరాజు, వడమ పార్దైసు, కొనురు సింహాచలం, కుప్ప త్రినాథరావు, టొంపల భాస్కరరావు, కంత నరసమ్మ, మెసురు ప్రేమ్‌కుమార్, టొంపల లక్ష్మినారాయణ, సుందరమ్మ, టోపింటి గౌరవమ్మ, టొంపల ఉషా, కొనురు భానమ్మ, మొజురు ప్రభావతి, గిడిత సావిత్రమ్మ, తలసంద్ర సంతోషమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ, కొత్తూరు సర్పంచ్ పడాల లక్ష్మణరావు, మండల సచివాలయ కన్వీనర్ గండివలస ఆనందరావు, పంకజ్ దాస్, దుర్గాసీ దేవరాజు, పాగిరి గోవింద్, పట్నాల షణ్ముఖబాబు, సొండి రాజా, విశాఖ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- రణస్థలం: కుతంత్రాలు, వెన్నుపోటు రాజకీయాల్లో ఆరితేరిన చంద్రబాబు కూటమి కుట్రలను తిప్పికొట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రణస్థలం మండలం పైడిభీమరం పంచాయతీ వరిసాం గ్రామానికి చెందిన చిన్నిపిన్ని సూరప్పడుతో పాటు 50 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, ఎంపీటీసీ మునకాల దుర్గారావు, మాజీ ఎంపీపీ గొర్లె విజయకుమార్, వైఎస్సార్‌సీపీ కొల్లి బోగేష్, డొప్ప రాము పాల్గొన్నారు.
- ఎచ్చెర్ల: లావేరు మండలం గోవిందపురం, బరిణికాం గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల నుంచి 50 కుటుంబాల వారు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అదపాక దాసు, కందివలస నాగేశ్వరరావు, జాడ పాపారావు, గడిదాసు సోములు, లంక లక్ష్మణ, లంక చంద్రరావు, లంక నాగేశ్వరరావు, అదపాక లచ్చుము, ఎం.నర్సుములు, పిల్ల వెంకన్న, రెడ్డి సూర్యనారాయణ, ఇజ్జాడ రామారావు, జాడ తవుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో ఎమ్మెల్యే కిరణ్

- నందిగాం: మండలంలోని దిమ్మిడిజోలలో పలువురు తెలుగుదేశం కార్యకర్తలు ఆ పార్టీని వీడి శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రేగల కూర్మారావు, కొల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కండువాలు ధరించారు. కార్యక్రమంలో కొల్లి చలపతిరావు, కొల్లి నారాయణరావు, సవర వసంత్, లోకనాథం, తోపాల కాయవాడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.
- కోటబొమ్మాళి: మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ యాదవ కుల సంఘ నాయకులు ముద్ద రామదాసు, యిద్దిబోయిన నారాయణరావు, వంజరాపు మల్లేసు, ఉర్జాన లచ్చుమయ్య తదితరులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టెక్కలి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో పార్టీ కండువాలు ధరించారు. కార్యక్రమంలో కురుడు ఎంపీటీసీ చుక్క లోకేష్, పార్టీ నాయకులు చింతాడ అనిరుద్రుడు, తోట సింహాచలం, దండాసి సింహాచలం, తోట శ్రీరాములు, యిద్దిబోయిన బుచ్చెయ్య, దుర్గయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.
- రణస్థలం: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జి.సిగడాం మండలం కప్పరాం గ్రామానికి చెందిన యర్రబోలు అన్నారావుతో పాటు 10 టీడీపీ కుటుంబాల వారు ఎమ్మెల్యే కిరణ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.
- కొత్తూరు: మండలంలోని మదనాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉప సర్పంచ్ గండికోట వెంకయ్యకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి కండువా వేసి ఆహ్వానించారు. మిగిలిన కుటుంబాలకు ఎమ్మెల్యే సూచన మేరకు పార్టీ సీనియర్ నాయకులు కలమట రమేష్‌బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉపసర్పంచ్ లచ్చయ్య, గాది సీతమ్మ, గాది నాగరాజు, పి.సింహాచలం తదితరులు ఉన్నారు.
- కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట పంచాయతీ కంట్రగడ గ్రామానికి చెందిన టీడీపీ యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పల్లి లోకేష్, తామరపల్లి దొరబాబు, దేశి చక్రవర్తి, సాన అశోక్‌కుమార్, ముడియా విక్రమ్, బాలరాజు, గొంత్ర కుటుంబ సభ్యులు ఉన్నారు. వీరందరికీ మంత్రి సీదిరి అప్పలరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చింతల సరస్వతమ్మ, తామరాపల్లి ధర్మారావు, మడియా మన్మధరావు, గోకర్ల సోమేష్ పాల్గొన్నారు.
- జి.సిగడాం: మండలంలోని కప్పరాం, గంగన్నదొరపాలెం, సేతుభీమవరం గ్రామాల్లో కూటమి పార్టీలకు చెందిన 250 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. సేతుభీమవరంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ కుదిరెళ్ల గోవిందరావు ఆధ్వర్యంలో బీజేపీ నుంచి బొల్లు రమేష్, గోపాలం, రమణ, అప్పారావు, శ్రీనివాసరావు, గోవిందరావు, ఆదినారాయణ, పైల రమణ, జాడ ఈశ్వరరావు, మరుపల్లి రాజారావు, పొన్నాడ శంకరరావు, వెంపడాపు పైడిరాజు, దేరసాపు పోలయ్యలతోపాటు 150 కుటుంబాలు చేరాయి. కప్పరాం గ్రామంలో మాజీ సర్పంచ్ యర్రబోలు అన్నారావు, పోతిరెడ్డి పెద్దిరాజు, గొలుసుపూడి దాస్, నాగన అన్నాజీ, పోతిరెడ్డి సీతారాం, గొలుసుపూడి శ్రీను, గోకా శంకరరావు, జాదం సూర్యనారాయణ, సింహాచలం, పోతిరెడ్డి అప్పారావుతోపాటు 40 కుటుంబాలు, గంగన్నదొరపాలెంలో ఇరుపల్లి సింహాద్రి, తొత్తడి రామారావు, కొరగాన తిరుపతి, దూసి రమేష్, దుర్గారావులతోపాటు మరో 30 మంది కుటుంబాలు పార్టీలో చేరారు. వీరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్, ఎన్నికల ఇన్‌చార్జి బూరాడ చిన్నారావు, నక్క ప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శి కంది నాని, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, తిరుమరెడ్డి గౌరీశంకరరావు, త్రినాథరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో కంచిలి, లండారపుట్టుగలకు చెందిన 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే నర్తు రామారావు, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాంట్రాక్టర్ కర్రియ్య, జోగారావు, కేశవరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, కడియాల ప్రకాష్, పి.నేతాజీ పాల్గొన్నారు.



నందిగాం: దిమ్మిడిజోల గ్రామస్తులకు కండువాలు వేస్తున్న పేరాడ తిలక్



రణస్థలం: పార్టీలో చేరిన వరిసాం టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



కోటబొమ్మాళి: పార్టీలో చేరిన యాదవ సంఘ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన కప్పరాం టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్



కొత్తూరు: వెంకటాపురం టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న రమేష్‌బాబు




జి.సిగడాం: గంగన్నదొరపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే కిరణ్

- అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు అండతో రెచ్చిపోయిన జన్మభూమి కమిటీలు
- కోటబొమ్మాళి మండలం యలమంచిలిలో 83 పింఛన్లను తొలగించిన జన్మభూమి కమిటీలు
- 45 రోజులు నిరశన దీక్ష చేసిన పింఛన్‌దారులు
- హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని జన్మభూమి కమిటీలు
- వీరి పింఛన్లు పునరుద్ధరించిన వైఎస్సార్ సీపీ
- ఇప్పుడు రూ.4వేలు పింఛన్ ఇస్తామంటూ టీడీపీ నాటకాలు

ఆ కమిటీల కథ.. గుర్తుందిి కదా..!

ఇంటిపై పచ్చ జెండా.. బండి వెనుక పార్టీ పేరు.. జన్మభూమి కమిటీలు చూసిన అర్హతలివి. కనిపిస్తే దండం పెట్టాలి.. పథకం కావాలంటే అడుక్కోవాలి.. ఆ కమిటీలు ఊరూరా పెట్టిన నిబంధనలివి. పింఛన్ ఇస్తే తీసుకోవాలి.. లేదంటే నోరు మూసుకుని ఉండాలి.. ఐదేళ్ల పాటు వారు సాగించిన దౌర్జన్య కాండ ఇది. ప్రజాస్వామ్యం సిగ్గు పడేలా, రాజ్యాంగ వ్యవస్థ తలదించుకునేలా జన్మభూమి కమిటీలతో టీడీపీ సాగించిన పాలన ఇంకా ఎవరూ మర్చిపోలేదు. ఈ కమిటీల అరాచకానికి కోటబొమ్మాళి ఓ ప్రత్యక్ష నిదర్శనం. ఐదేళ్ల కిందట జరిగిన ఆ కథ లోతుల్లోకి వెళితే..



టెక్కలి:

కోటబొమ్మాళి మండలం యలమంచిలి పంచాయతీ ప్రజలు టీడీపీకి అనుకూలంగా లేరు. ఇదొక్కటే వారు చేసిన తప్పు. కేవలం ఇదే కారణంతో అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు అండతో జన్మభూమి కమిటీలు ఆ ఊరిలో 83 మంది పింఛన్లను కక్ష కట్టి ఆపేశారు. ఎంతగా వేడుకున్నా వారు కరుణించలేదు. అధికారమంతా వారి చేతులోనే ఉండడంతో ఎవరూ ఏమీ చేయలేకపోయారు. పింఛన్‌దారుల్లో 10 మంది మానసిక క్షోభకు గురై చనిపోయారు. తమ పింఛన్లను పునరుద్ధరించాలని వీరంతా సుమారు 45 రోజుల పాటు కోటబొమ్మాళి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలతో న్యాయ పోరాటం చేశారు. జిల్లా స్థాయి అధికారులను కూడా ఆశ్రయించారు. అయినా జన్మభూమి కమిటీల బలం ముందు ఎవరూ సరిపోలేదు. ఆఖరకు వీరంతా హైకోర్టును ఆశ్రయించారు. తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ జన్మభూమి కమిటీలు అడ్డుపడి పింఛన్లు ఇవ్వకుండా అధికారులను బెదిరించారు. మళ్లీ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి పింఛన్లను పునరుద్ధరించారు. ఇలాంటి అకృత్యాలకు పాల్పడిన టీడీపీ ఇప్పుడు రూ.4వేలు పింఛన్ ఇస్తామంటూ చెబుతుండడంపై పింఛన్‌దారులు నవ్వుతున్నారు. చంద్రబాబు మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. టీడీపీ పాలనలో యలమంచిలి పంచాయతీలో జన్మభూమి కమిటీల కక్ష సాధింపు చర్యలకు సుమారు 10 మంది పింఛన్‌దారులు బలైపోయారు. మామిడి లక్ష్మీనారాయణ, వేసవి వరలక్ష్మి, కెల్లి తవుడు, కోట వెంకట్రావు, బలగ లచ్చమ్మతో పాటు మరి కొంత మంది బెంగతో మరణించారు.

ఆ కుట్రలు కళ్ల ముంగిటే ఉన్నాయి

పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామని జన్మభూమి కమిటీలు కక్ష కట్టాయి. నాతో పాటు 83 మంది పింఛన్లు అన్యాయంగా తొలగించారు. అప్పట్లో జన్మభూమి కమిటీలు చేసిన కుట్రలు ఇంకా కళ్ల ముంగిటే ఉన్నాయి. కొంత మంది పింఛన్‌దారులు జన్మభూమి కమిటీల కాళ్లపై పడినా కరుణ చూపలేదు. అలాంటి జన్మభూమి కమిటీల పాలన కలలో కూడా ఊహించలేం. దీక్షలు చేశాం. జిల్లా అధికారులను కలిశాం. అయినా పింఛన్లు ఇవ్వలేదు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ పింఛన్లు వచ్చాయి.

– బెండి అప్పారావు, పింఛన్‌దారుడు, యలమంచిలి, కోటబొమ్మాళి మండలం

హైకోర్టును ఆశ్రయించాం

మా పంచాయతీలో జన్మభూమి కమిటీలు 83 మంది పింఛన్లు అన్యాయంగా తొలగించారు. బాధితులతో కలిసి సుమారు 45 రోజుల పాటు కోటబొమ్మాళి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట న్యాయ పోరాటం చేశాం. కలెక్టర్‌కు చెప్పుకున్నాం. మా సోదరుడు న్యాయవాది మన్మథరావు సహకారంతో హైకోర్టును ఆశ్రయించాం. 2017లో పింఛన్‌దారులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు అండతో జన్మభూమి కమిటీలు అధికారులను బెదిరించి పింఛన్లు ఇవ్వకుండా ఆపేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందరికీ పింఛన్లు పునరుద్ధరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయ భేదం లేకుండా పింఛన్లు అందజేశారు.

– కవిటి రామరాజు, బాధిత పింఛన్‌దారుల తరఫున పోరాటం చేసిన వ్యక్తి, యలమంచిలి, కోటబొమ్మాళి మండలం.

కలెక్టర్ ఆదేశాలు కూడా పనిచేయలేదు

2014 సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జన్మభూమి కమిటీ వారు మా పింఛన్లు తీసేశారు. కోటబొమ్మాళి ఎంపీడీఓ ఆఫీస్ దగ్గర 45 రోజులు న్యాయ పోరాటం చేశాం. కలెక్టర్ స్పందించి పింఛన్లు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ జన్మభూమి కమిటీల ముందు ఆదేశాలు పనిచేయలేదు. ఐదేళ్ల నిరీక్ష తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా అందరికీ పింఛన్లు వచ్చాయి. అయితే అప్పటికే కొంత మంది బెంగ పెట్టుకుని చనిపోయారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చంద్రబాబు చెబుతున్న మాటలకు మేము మోసపోయేది లేదు. – కవిటి మన్మథరావు, పింఛన్‌దారుడు, యలమంచిలి.

నా కూతురిని పొట్టన పెట్టుకున్నారు...

నా కూతురు వేసవి వరలక్ష్మికి వికలాంగ పింఛన్ వస్తుండేది. జన్మభూమి కమిటీలు ఆ పింఛన్ తీసేశారు. ఎన్నో సార్లు కమిటీ నాయకుల కాళ్లపై పడి మొరపెట్టుకున్నా, మా ఆవేదన ఆలకించలేదు. రోజులు గడిచిన కొద్దీ నా కూతురు బెంగ పెట్టుకుని చనిపోయింది. అన్యాయంగా నా కూతుర్ని పొట్టన పెట్టుకున్నారు.

– వేసవి రామ్మూర్తి, జన్మభూమి కమిటీల కక్షసాధింపుతో మృతి చెందిన వరలక్ష్మి తండ్రి.

ఇప్పుడు ఏ కక్షలు లేవు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు కొత్తగా పింఛన్ వచ్చింది. ఈ ప్రభుత్వంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేకుండా నేరుగా ఇంటికే పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు చంద్రబాబు చేసిన కుట్రలకు మళ్లీ పింఛన్‌దారులకు అవస్థలు మొదలయ్యాయి. ఈ ఎన్నికల్లో మరో సారి సీఎం వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసి మళ్లీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటికే పింఛన్ తెప్పించుకుంటాం.

– కె.అప్పలనాయుడు, పింఛన్‌దారుడు, యలమంచిలి.

క్లుప్తంగా


పలాసకు చేరిన జన చైతన్య యాత్ర



పెదగంతారులో కుమారన్నకు జోహార్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: విప్లవ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నెల్లూరులో ప్రారంభమైన జనచైతన్య యాత్ర ఆదివారం పలాసకు చేరుకుంది. పలాస మండలంలోని మాకన్నపల్లి, చిన్ననీలావతి, లొత్తూరు పంచాయతీలోని పెదగంతారు తదితర గ్రామాల్లో పర్యటించారు. పెదగంతారు గ్రామంలోని కుమారన్న ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. కుమారన్నకు జోహార్లు అర్పించారు. గిరిజనులకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అరుణోదయ గాయకురాలు విమలక్క తన ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.రమేష్, బి.రమేష్, అంజిబాబు, వల్లూరి రాజబాబు, నెలబాలుడు, బి.గంగా, రాకేస్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు



ఎంసీపీ కొత్తూరులో సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు సి.పంచాయతీ పరిధిలోని ఎంసీపీ కొత్తూరు గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో ఆదివారం సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 45 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పలాస డీటీఎఫ్ సీఐ, రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు పలువురు సిబ్బంది ఉన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టో అమలు సాధ్యమేనా..?

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రస్తుత ఆదాయం రూ.90 వేల కోట్లు అయితే చంద్రబాబు ఈ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు రూ.1.5 లక్షల కోట్లకు మించి ఉన్నాయని వీటిని అమలు చేయటం సాధ్యమా అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. శ్రీశయన సంఘం సభ్యుడు శాంత మూర్తి షష్టిపూర్తి కార్యక్రమం ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా వచ్చిన మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాల విలువ రూ.1.5లక్షల కోట్లు అని దీనికి జీతభత్యాలు, ఇతర ఖర్చులు అదనంగా ఉంటాయన్నారు. ఇది ఎలా అమలు సాధ్యమో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విలువ రూ.75వేల కోట్లని వీటిని అమలు చేస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని, ఆర్థికంగా దివాలా తీస్తుందని చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులు అనేక సందర్భాల్లో తప్పుడు ప్రచారం చేశారని గుర్తు చేశారు. అదే చంద్రబాబు రూ.1.5లక్షల కోట్లతో పథకాలు ఎలా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకే బీజేపీ మేనిఫెస్టో పత్రాన్ని ముట్టుకోవటానికి కూడా ఇష్టపడలేదన్నారు. మోదీ ఫొటో కూడా ముద్రించనివ్వలేదన్నారు. రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ మార్గంలో నడిపిస్తున్నారని, జిల్లా అభివృద్ధికి తనవంతుగా ఎంతో కృషి చేశానని, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంత్రివర్గంలో పనిచేయటం తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. భూ హక్కు చట్టంపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నిజం ఏమిటో రెవెన్యూ శాఖలో కీలక పదవులు చేపట్టిన డీపీ దేవ్ వంటి మేధావులకు తెలుసన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మెంటాడ స్వరూప్, నాయకులు తెన్నేటి సునీల్ శర్మ, రాష్ట్ర శ్రీసైన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, బలగ పండరీనాథ్, మెండ శాస్త్రి, శాంతమూర్తి, చిట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'కింజరాపు కుటుంబీకులు ఎవరినీ ఎదగనీయరు'



మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

కోటబొమ్మాళి: కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు కులాలను వాడుకుని ఎవరినీ ఎదగనీయలేదని, గత 40 ఏళ్లుగా ఇలాగే మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. వారు ఆదివారం కోటబొమ్మాళిలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి మండలాల వాసులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తిలక్, శ్రీనివాస్ మాట్లాడుతూ నలభై ఏళ్లుగా కింజరాపు కుటుంబీకులు మాత్రమే పదవులు అనుభవిస్తూ వారికి మద్దతు ఇస్తూ వస్తున్న వెలమ తదితర సామాజిక వర్గాలకు అన్యాయం చేశారని అన్నారు. అందుకే టెక్కలిలో ఎందరో వెలమ సామాజిక వర్గీయులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వస్తే అందరికీ సమ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కోటబొమ్మాళిలో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి వెలమ సంఘం భవనంతో పాటు, కల్యాణ మండపం నిర్మిస్తామని, మూలపేట పోర్టులో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, పార్టీ నాయకులు పొన్నాన చంటి, నేతింటి అప్పలస్వామి, తర్ర కామినాయుడు, వాన అసిరినాయుడు, కింజరాపు అప్పన్న, అల్లు కళ్యాణి, నేతింటి సింహాచలం, పంగ రామయ్య, వాన తవిటయ్య, పొన్నాన మోహన్, పల్లి రామారావు, పంగ యోగేశ్వరావు, రెడ్డి లక్ష్మణ, బాడాన లక్ష్మీనారాయణ, కొండాల శిమ్మయ్య, పంగ చందర్‌రావు, వెలమల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలేరు రోడ్డుకు ఏనుగుల గుంపు



బాలేరు వద్ద పంట పొలాల్లో ఏనుగుల గుంపు

భామిని: ఆహారం కొరతతో ఏనుగుల గుంపు పట్టపగలు ఆరు బయటకు వచ్చి ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం భామిని మండలంలోని బాలేరు వద్ద ఏబీ రోడ్డు సమీపంలోకి నాలుగు ఏనుగులు వచ్చి పంటలను తినేశాయి. మామిడి చెట్ల కొమ్మలు, చెరుకు పంటతో పాటు వ్యవసాయ బోరు పైపులను బయటకు లాగి పాడు చేశాయి. ప్రజలు, రోడ్డుపై ప్రయాణికులు చూస్తుండగానే విధ్వంసానికి పాల్పడ్డాయి. ఏనుగుల గుంపు రోడ్డు సమీపంలోకి రావడంతో గ్రామస్తులు పరుగుపెట్టారు. రాత్రిపూట రోడ్డుపై ప్రయాణాలు కష్టంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైవ్ ద్వారా మోకాలి సర్జరీపై అవగాహన

శ్రీకాకుళం:

ప్రభుత్వ వైద్య కళాశాల, రిమ్స్ (సర్వజన) ఆస్పత్రిలో ఆదివారం మిడ్ టర్మ్ సెమ్–2024లో భాగంగా రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా లైవ్ టెలీ కాస్ట్ ద్వారా మోకాలి సర్జరీ అవగాహన కల్పించినట్లు రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం తెలిపారు. ప్రముఖ ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సునీల్ లైవ్ టెలీకాస్ట్ నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు, ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ ధర్మారావు, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ నాగేంద్రనాయకుడు, డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఈ లైవ్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 186 మంది వైద్యులు పాల్గొన్నారని తెలిపారు.



లైవ్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటాచలం



- నాడు-నేడు.. తేడా చూడు



పోలాకిలో 1952లో కరిమి నారాయణఅప్పలనాయుడు దాతృత్వంతో ఏర్పడిన విద్యాలయమిది. ప్రభుత్వాలు చిన్న చూపు చూడడంతో దశాబ్దాలుగా అభివృద్ధి లేక కునారిల్లిపోయింది. వైఎస్సార్ సీపీ అమలు చేసిన నాడు–నేడు పథకం ఈ బడికి మళ్లీ జవసత్వాలు నింపింది. ప్రస్తుతం అన్ని వసతులు కలిగిన పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను చూసి పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – పోలాకి

నేడే హోమ్ ఓటింగ్

- వినియోగించుకోనున్న 495 మంది ఓటర్లు
- 188 బృందాల ఏర్పాటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నుంచి హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. 85 ఏళ్లు పైబడి ఉన్న అలాగే, 40 శాతం దాటి అంగవైకల్యం ఉన్న ఓటర్లు ఇందుకు అర్హులు. జిల్లాలో ఈ కేటగిరీల్లో 32,938 మంది ఉన్నప్పటికీ కేవలం 495 మంది మాత్రమే తాము ఇంటి నుంచి ఓటు వేస్తామని ఎన్నికల కమిషన్‌ను కోరడంతో అధికారులు ఆయా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్ నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు మిగిలిన వారు మొగ్గు చూపారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరాంలలో గడిచిన శాసనసభ ఎన్నికల్లో ఈ హోం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అవి విజయవంతం కావడంతో ఇప్పుడు దేశంలో పార్లమెంట్ సహా శాసనసభలకు జరుగుతున్న ఎన్నికలకు మరోసారి హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో తొలి మూడు స్థానాల్లో నరసన్నపేటలో 68 మంది, ఇచ్ఛాపురంలో 65, శ్రీకాకుళంలో 53 మంది ఓటర్లు ఆయా నియోజకవర్గాల వారీగా హోమ్ ఓటింగ్‌లో ఓటు హక్కును తొలిసారి వినియోగించుకోనున్నారు.

188 బృందాల ఏర్పాటు

హోమ్ ఓటింగ్ కోసం జిల్లాలో 188 ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులు(పోలింగ్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఆఫీసర్, ఏపీఓ), వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, సెక్టార్ ఆఫీసర్ ఉంటారు. ఆయా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఏజెంట్లు మీడియా సమక్షంలో హోమ్ ఓటింగ్ పూర్తి చేస్తారు. తర్వాత హోమ్ ఓటింగ్ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. సాధారణ ఓట్ల లెక్కింపు రోజునే ఆయా ఓట్లతో హోమ్ ఓటింగ్ ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుంది. జిల్లాలో 495 మంది మాత్రమే ఓట్లు ఉండటంతో ఒక్కరోజులోనే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ ఇప్పటికే ఆయా అధికారులను ఆదేశించారు.

మాజీ సైనికులు ఓటు హక్కు వినియోగించుకోవాలి



వెంకటరెడ్డిని సత్కరిస్తున్న జిల్లా సమాఖ్య ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మాజీ సైనికులంతా తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య ఉత్తరాంధ్ర అధ్యక్షుడు చిల్ల వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లి వీధిలో ఉన్న జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయం ప్రాంగణంలో మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తమ్మీద పోలిస్తే శ్రీకాకుళం జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో మాజీ సైనికులు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇతర ఉద్యోగాల్లో చేరిన మాజీ సైనికులు కూడా విధుల్లో ఉన్నారని, వారంతా తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రథసప్తమి నాడు అరసవల్లిలో విశేషంగా సేవలు అందించిన మాజీ సైనికులు, వీర నారీమణులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు టి.కృష్ణారావు, ఎస్.ఎల్.రావు, ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, కోశాధికారి ఎమ్.సింహాచలం, స్పోక్ పర్సన్ కె.కన్నారావు, మహిళా సెక్రెటరీలు ఎ.లక్ష్మి, కె.జగ్గమ్మ, సలహాదారులు పద్మావతి, ఎ.వి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో భక్తుల రద్దీ



రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



క్యూలో వస్తున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో భక్తజనం ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్వామికి ప్రీతిపాత్రమైన ఆదివారం సందర్భంగా జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేకంగా పూజలు చేయించుకున్నారు. మహిళలు ఇంద్రపుష్కరిణి వద్ద రావిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు దాహార్తి తీర్చేలా మంచినీళ్ల ప్యాకెట్లను క్యూలైన్ల వద్దనే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక్కరోజు వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,00,800, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.65,858, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా అధికారులు తెలియజేశారు.

నీ ఓటే ఒక సంచలనం



ప్రయాణికులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఓటు హక్కును అంతా వినియోగించుకోవాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి నీరజ సుబ్రహ్మణ్యం శిష్య బృందం, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై నృత్యరూపంలో అవగాహన కల్పించారు. ప్రతి వందమందిలో ముప్పై మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవటం లేదని, వీరంతా 18–40 ఏళ్ల లోపు వారేనని అన్నారు.